# దీక్ష

-కోరుకొండ సత్యానంద్

"నా న్నా! బూటు చిరిగిపోయింది. వేసుకోడానికి వీలవ్వడం లేదు. బూటు లేకుండా స్కూల్‌కి వెళ్తే క్లాసులోకి రానివ్వడం లేదు. నాకు కొత్త బూటు కొనరూ?"

ఫ్యాక్టరీ గొడవల్లో పడి అలసిపోయిన సుందరం ఇంటికి రాగానే పన్నెండేళ్ళ వాసు అలా అడిగినందుకు చిరాకొచ్చింది.



చిరాకు బయటపెట్టకుండా...

"కొత్తదైతే తర్వాత కొంటాన్లే. అందాక కుట్టించుకొని వేసుకో" అన్నాడు.

"ఉహు, కుట్టిస్తే బాగుండదు. చూడండి. ఎలా చిట్లిపోయిందో?"

కొడుకు చూపించిన బూటువైపు చూశాడు. అది పాడైపోవడం అదివరకే గమనించాడు

కుట్టిస్తే మరి కొద్ది రోజులు రావొచ్చు. అయినా కుట్టించుకోవడం వాసుకి ఇష్టంలేదు.

"ఒకుయ్ కొత్తవి కొనడానికి డబ్బుండొద్దూ? మాకు బోనస్‌లు వస్తాయికదా, అప్పుడు కొంటాను. వాటినిలా ఇయ్యి. నేనే బాగా కుట్టించితెస్తాను. అందాకతొడుక్కో"

వాసుకింక ఏమనాలో అర్థం కాలేదు బూట్లను అక్కడపెట్టి బుంగమూతి పెట్టుకొని వెళ్ళిపోయాడు.

"హమ్మయ్య ఊరుకున్నాడు. కుట్టించి పడేస్తే వాడే తొడుగుతాడు మరోనెల రోజులు. కాన్వెంట్లో చదువుతున్న పిల్లల్తో ఇదే గొడవ." అనుకుంటూ స్నానానికి వెళ్ళాడు.

★ ★ ★

సుందరం ఆ కాబిన్లోకి అడుగు పెట్టేడు. లోపల మేనేజింగ్ డైరెక్టరు, మేనేజర్ - పర్సనల్, మేనేజర్ ఫైనాన్స్ తదితరులున్నారు.

"రండి ఇలా కూర్చోండి" అని సుందరానికి కుర్చీ చూపించారు. సుందరం కూర్చున్నాడు.

"ఇప్పుడు చెప్పండి మీ డిమాండ్స్ ఏమిటి?"

"మెమొరాండం సబ్‌మిట్ చేశాం కదా. చూడలేదా?

"చూశాం కాని మీ డిమాండ్స్‌ని తీర్చే స్థితిలో కంపెనీ లేదు."

"ఎందుకు లేదు? ఈ సంవత్సరం క్రితం కంటే ఎక్కువ లాభాలే వచ్చేయి. బోనస్ ఇవ్వగల ఆర్థిక స్థోమత కంపెనీకి లేదని సర్క్యులర్ జారీ చేశారెందుకు?"

"అందులో కారణాలు కూడా రాశాం కదా?"

"కారణాలు చాలా రాయొచ్చు. అలాగే మా కారణాలు, మాకూ ఉన్నాయి. బోనస్‌తోపాటూ ఎక్స్‌గ్రేషియా కూడా, ఇచ్చే స్థితిలో ఉంది కంపెనీ. కనీసం బోనస్‌కూడా ఇవ్వకపోతే ఎలా? ఇచ్చి తీరాలి. పోతె, ధరలు విపరీతంగ పెరిగిపోయాయి. మీరిచ్చే జీతాల్తో చిన్న కుటుంబాల వాళ్ళే చాలా ఇబ్బందిపడాల్సి వస్తుంది. ఇక పెద్ద కుటుంబాలైతే ఇంక చెప్పక్కర్లేదు. అందుచేత మా జీతం స్కేళ్ళు కూడా పెంచాలి."

అక్కడున్న వారంతా ఒక్క నిమిషం ఏమీ మాట్లాడలేదు.

"వెల్ మిస్టర్ సుందరం మీరు చెప్పింది బాగానే ఉంది. కానీ మీరు చెప్పినట్టు బోనస్‌లిచ్చేస్తే, జీతాలు పెంచేస్తే మీ సమస్య తీరిపోతుంది. కానీ మా సమస్యల్ని ఎవరు పరిష్కరిస్తారు?"

"మీ సమస్యలేమిటి?"

"ఇప్పటికే బిజినెస్ కాంపిటీషన్ తట్టుకోలేక పి తున్నాయి మన ప్రొడక్ట్సు. మీరడిగినవన్నీ మేము ఒప్పేను

కుంటే ప్రొడక్టు ధరలు పెంచాల్సి వస్తుంది. అప్పుడు సేల్సు తగ్గిపోతాయి. లాభాలూ తగ్గిపోతాయి. ఈ లాభాల్తోనే కంపెనీని నడపడం కష్టం అవుతుంది. ఇంకా తగ్గితే వర్కవుట్ అవ్వదు. అప్పుడు కంపెనీ మూసేయాల్సొస్తుంది.

"మీకు వర్కవుట్ అవ్వదన్నదే మీరు ఆలోచిస్తున్నారు. కానీ పెరిగిపోయిన ధరల దగ్గర మీరిచ్చే జీతాలు వెల వెల బోతున్నాయి. చెమట ధారపోసి శ్రమించినా మా కుటుంబాన్ని సరిగా పోషించుకోలేక పోతున్నాం."

"మీకు అవసరమైన వస్తువుల ధరలే కాదు. ఫ్యాక్టరీకి అవసరమైన ముడిసరుకు ధరలు కూడా పెరిగి పోతున్నాయి. మీ అరుపులు, బాధలు మీవేగానీ మా బాధల మాటేమిటి?"

"లాభాలు మీ ఒక్కరి సొత్తే కాదు. అందులో కార్మికులం, మాకు కూడా వాటా ఉంది. అదివ్వక తప్పదు. ఎన్నిసార్లు ఉత్పత్తుల ధరలు పెంచలేదు? అన్నిసార్లూ మేమేమైనా అడిగామా, మీరిచ్చారా? లాభాలు లేశమాత్రం తగ్గుతాయేమో గానీ నష్టాలు ఎంత మాత్రం రావని మాకు తెలీదనుకోకండి. బోనసులూ ఇవ్వాలి. జీతాలూ పెంచాలి. అందుకు కూలంకుషంగా చర్చలు జరిగే ఏర్పాటు చేయండి."

"ఇప్పుడు జరుగుతున్నదీ చర్చే. దానికి మళ్ళీ మరో ప్రత్యేక ఏర్పాట్లు చేయక్కర్లేదు. లాభాల్ని బట్టి మీరు అడక్కుండా మేమే అన్నీ ఇస్తాం. అనవసరపు వాదులాటలు మాని పని చేసుకోండి."

"అది జరగదని చెప్పడానికే మేమంతా నిర్ణయించున్నాం. రేపట్నించి పని సాగాలంటే, యంత్రాలు నడవాలంటే, ఉత్పత్తి జరగాలంటే మా కోర్కెలు తీరాలి. లేకపోతే అన్నీ ఆగిపోతాయి. ఫ్యాక్టరీ స్తంభించిపోతుంది."

"బాగా ఆలోచించండి మిస్టర్ సుందరం!"

"ఆలోచించే మా ఆకలి కడుపులు విన్నపాలు చేసుకున్నాయిన్నాళ్ళూ, ఫ్యాక్టరీకే మా కాలాన్ని, రక్తాన్నీ, ప్రాణాల్నీ ధారపోస్తున్నప్పుడు విలాసజీవితం కాకపోయినా, కనీసం మూడుపూటలూ కడుపైనా నిండాలిగా? అసలు మీ నిర్ణయం ఏమిటో ఖచ్చితంగా చెప్పండి."

"ఖచ్చితంగా చెప్పమన్నారు కాబట్టి చెప్పేస్తున్నాం. ఈ సంవత్సరం బోనసులివ్వం. వచ్చే ఏడాది ఆలోచిస్తాం. జీతాల గురించి మాత్రం రెండు మూడేళ్ళు దాకా అగక తప్పదు. ఏం చేస్తారో చేసుకోండి. అంతగా అవసరం అయితే లాకవుట్ చేసి పారేస్తాం!

"...సరే!" సుందరం విసురుగా లేచి వచ్చేశాడు.

బయట కార్మిక సోదరుల సందోహం హర్షధ్వానాల్తో సుందరానికి స్వాగతం పలికారు. విషయం వివరించి చెప్పాడు వాళ్ళందరికీ సుందరం. అందరి గుండెలూ మండిపోయాయి. అందరూ ఒకరోజు చర్చలు జరిపారు. ఆఖర్న ఓ నిర్ణయానికొచ్చారు.

★ ★ ★

సుందరం కళ్ళు లోతుకు పోయాయి. దవడలు పీక్కుపోయాయి. గుండెలో ధైర్యం మాత్రం సడలిపోలేదు. అండగా ఉన్న కార్మిక సోదరులందరూ అతని వెనుక ఉండి అతన్ని ముందుకి నడిపిస్తున్నారు.

ఏదైనా జరగరానిది జరిగితే అందుకు కారకులైన వాళ్ళమీద నిప్పుల వర్షం కురిపించేలా ఉన్నారు.

ఆ రోజు సుందరం పరిస్థితి విషమించింది. ధైర్యం, పట్టుదల మాత్రం రెట్టింపయ్యాయి. అందుకే ఆ ఉదయం శిబిరం దగ్గరకు ఓ కారు వచ్చి ఆగింది. కార్మికుల హర్షధ్వానాలకి, సుందరం కళ్ళల్లో ఆనంద బాష్పాలకీ ఆ కారే కారణమయ్యింది.

★ ★ ★

తెరచిన ఫ్యాక్టరీలో మొదటిరోజు ఆనందంగా పనిచేసి ఇంటికి వచ్చాడు సుందరం. గదిలోంచి భార్య సుశీల మాటలు స్పష్టంగా విన్పిస్తున్నాయి.

"కంపెనీలో నిన్నటి వరకూ మీ నాన్న, ఇక్కడ నువ్వు. బాగుందిరా, ఆయన తన ప్రాణాల మీదకి, నువ్వు నా ప్రాణాల మీదకీ తీసుకొస్తున్నారు. నిన్నంతా ఒక మెతుకైనా తినలేదు. ఉదయం కూడా ఏమీ తినలేదు. ఇప్పుడు కూడా తినకపోతే ఎలా? తినరా నాన్న..."

వాసుకి నచ్చజెప్పుతుంది సుశీల. నిన్నటి వరకూ భర్త గురించిన ఆందోళన ఆమెలో ఇంకా పోలేదు.

అంతలోనే కొడుకుకి నచ్చచెప్పలేని అశక్తతతో సుశీల నలిగిపోతున్నట్లు స్పష్టంగా అర్థమవుతుంది. సుందరానికి ఆమె మాటల్లో వాసు తల్లి మాటల్ని పట్టించుకోవడం లేదు. మొండిగా ఉండిపోయాడు.

కొడుకు నిన్నటి నుండీ ఏమీ తినలేదని తెలిసి అతని ప్రాణం విల విల్లాడిపోయింది.

సుశీల నిన్నేమి చెప్పలేదు. నీరసంతో, అలసటతో ఉన్నాననేమో. సంతోషంతో తనూ గమనించలేదు. విషయం ఏమిటోనని గబగబా గదిలోకి వెళ్ళాడు.


సుశీల విషయం చెప్పింది. సుందరానికి నవ్వాలో, బాధపడాలో అర్థం కాలేదు. కానీ ఏదో భావం మాత్రం అతని మనసుని చుట్టేసింది. వెంటనే కొడుకుని ఎత్తుకున్నాడు. గుండెలకు హత్తుకున్నాడు.

"కొంటాను లేరా, నీక్కావల్సింది కొత్త బూటేకదా. తప్పకుండా కొంటాను. నేను గెలిచి నిన్నోడిస్తానా? నిన్ను కూడా గెలిపిస్తాను. ఈ అన్నం తిను. లేరా వాసూ. అన్నం తినేస్తే వెంటనే బజారుకి తీసుకెళ్ళి నీకు నచ్చిన బూటు కొంటాను సరేనా?"

సుశీల చేతిలో ఉన్న కంచం లోంచి ఓ ముద్ద తీసి కొడుకు నోటికి అందించాడు. అప్పుడు కానీ వాసు నోరు తెరవలేదు.

తను పెట్టిన ముద్దని కొడుకు తింటూంటే మొన్నటి రోజు మేనేజ్మెంటు ప్రతినిధి అందించిన గ్లాసుని అందుకొని తను నిమ్మరసం త్రాగిన సంఘటన స్పురణకొచ్చింది సుందరానికి.

కోరుకొండ సత్యానంద్
సెంట్రల్ వేర్‌హౌస్
స్పిన్నింగ్ మిల్స్ పోస్ట్
రాజమండ్రి - 533 106.




కెంచు చిన్నన్న, కార్టూనిస్ట్, పోస్టు:చిన్నమెట్‌పల్లి-505453, మం:కొరుట్ల, జిల్లా:కరీంనగర్.